కూటమి పాలన.. ప్రజలకు వంచన

- ప్రధాన హామీలను తుంగలోకి తొక్కిన చంద్రబాబు ప్రభుత్వం
- ప్రజా వ్యతిరేక విధానాలపై వైఎస్సార్ సీపీ ఉద్యమం
- నేడు మండపేటలో నియోజకవర్గస్థాయి బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ సమావేశం
- విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్సీ తోట పిలుపు


కూటమి పభుత్వ వెన్నుపోటు దినం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట (ఫైల్)

కపిలేశ్వరపురం: కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్‌తో పాటు ఇతర హామీలను తుంగలోకి తొక్కుతున్నారు. హామీలు అమలు చేయమని ప్రశ్నించిన వారిపైనా, ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలపైనా అణచివేతకు పాల్పడుతున్నారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై వైఎస్సార్ సీపీ పోరుబాట పట్టింది. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో ఉద్యమానికి సిద్ధమయ్యారు. మండపేట పట్టణంలోని సూర్య కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం ‘బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ’ పేరుతో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సమావేశానికి పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పిలుపునిచ్చారు.

గతంలో విమర్శించిన పార్టీలతో జతకట్టి..

2024 ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే కాంక్షతో చంద్రబాబు ఒకప్పుడు విమర్శించిన, దుయ్యబెట్టిన పార్టీలతో కూటమిగా జతకట్టి ఓట్లు, సీట్లు పంచుకున్నారు. సామాన్యుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఓడించడమే లక్ష్యంగా వ్యక్తిగత ఆరోపణలు, అభాండాలు వేస్తూ దుష్ప్రచారం చేశారు. అందుకోసం కులాలు, మతాలు, ప్రాంతాలు ఇలా ప్రతి అంశాన్నీ రాజకీయం చేస్తూ చంద్రబాబు ఎన్నికల ఎత్తుగడలు వేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అమలు కాని హామీలను గుప్పించారు. అధికారంలోకి వచ్చాక హామీలను తుంగలోకి తొక్కి ప్రజలను నిలువునా మోసగిస్తున్నారు.

ప్రశ్నార్థకంగా పవన్ కల్యాణ్ తీరు

పాతిక కేజీల బియ్యం కాదు, పాతికేళ్ల భవిష్యత్‌ను ఇస్తాను, కూటమికి ఓటెయండి, నాదీ హామీ అంటూ 2024 ఎన్నికల ప్రచార సభల్లో మాట్లాడిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీరు ప్రస్తుతం హాస్యాస్పదంగా మారింది. కూటమి అధికారంలోకి వచ్చాక పవన్ భవిష్యత్తే ప్రశ్నార్థకంగా మారిందని ప్రజలు అంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిచిన్న విషయానికి హడావిడి చేసే పవన్ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న ఘోరాలపై నోరు మెదపకపోవడాన్ని చూసి జనం ఆశ్చర్యపోతున్నారు.

మహిళలపై దాడులు అమానుషం



కూటమి ప్రభుత్వం వచ్చాక సామాన్య ప్రజలపై మరీ ముఖ్యంగా మహిళలపై దాడులు పెరిగిపోయాయి. తాము అధికారంలోకి వస్తే మహిళలను హింసించిన వారికి భయపడేలా చర్యలు ఉంటాయని చెప్పారు. తీరా అధికారంలోకి వచ్చాక కూటమి నేతలు, వారి అనుచరులే మహిళలను హింసిస్తున్న తీరు రాష్ట్రంలో స్పష్టంగా కనిపిస్తుంది.

పతివాడ నూక దుర్గారాణి,
మున్సిపల్ చైర్‌పర్సన్, మండపేట.

కూటమి మోసాలను ఎండగడతాం



కూటమి ప్రభుత్వం వస్తే తమ జీవితాలు బాగుపడతాయని ప్రజలు నమ్మారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అందిన సాయానికి అనేక రెట్లు సాయం అందజేస్తామంటూ కూటమి నేతలు ప్రజలను నమ్మబలికారు. తీరా అధికారంలోకి వచ్చాక ఒక్కో సంక్షేమ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రధాన హామీలు అమలుకు నోచుకోవడం లేదు. సంపద సృష్టిస్తానన్న చంద్రబాబు ప్రజలపై భారాలను మోపుతున్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతాం. –తోట త్రిమూర్తులు, ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మండపేట

సామాన్యులపై భారం



కూటమి ప్రభుత్వంలో నష్టపోని, ఇబ్బంది పడని కుటుంబం లేదు. విద్యుత్ బిల్లులు పెంచి సామాన్యులపై భారం మోపారు. ఏడాది కాలంలో ఇవ్వాల్సిన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ ఆర్థికసాయం ఎగవేశారు. రైతులకు సకాలంలో ధాన్యం సొమ్మును ఇవ్వలేకపోయారు. మహిళలకు ఉచిత బస్సు తుస్సుమనిపిస్తున్నారు. ఏడాది కాలంలో సామాన్యులను ప్రభుత్వం తీవ్రంగా బాధించింది.

–కర్రి పాపారాయుడు,
వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి,
అర్తమూరు

వ్యవస్థలు నిర్వీర్యం



ప్రజా సంక్షేమాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయం, వలంటీర్, ఎండీయూ వ్యవస్థలను ఏర్పాటు చేసింది. ఆ పథకాలు మొత్తం దేశాన్ని ఆలోచింపజేశాయి. కూటమి అధికారంలోకి వచ్చాక వలంటీర్లను విధులకు దూరం చేసింది. వారిని కొనసాగిస్తూ రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తామన్న హామీని విస్మరించారు. సచివాలయాలను రేషనలైజేషన్ పేరుతో తగ్గించేశారు. సేవలను కుదించారు. వారిపై పనిభారం పెంచేశారు.

–అడబాల బాబ్జి, ద్వారపూడి,
మండపేట రూరల్ మండలం

రైతన్నలను దగా చేసిన కూటమి



24 గంటల్లో ధాన్యం అమ్మిన డబ్బులను ఖాతాలకు జమ చేసేస్తామని కూటమి నేతలు రైతులకు గొప్పలు చెప్పారు. కొందరికి మాత్రమే జమ చేశారు. మిగిలిన వారికి వరినాట్లు పూర్తయ్యాక జమ చేశారు. ఈ జాప్యంతో రైతులు అప్పులపాలయ్యారు. అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం నేటికీ ఇవ్వలేదు.

–వెలగల సత్యనారాయణరెడ్డి,
రాయవరం
మండలం

యథేచ్ఛగా ఇసుక అక్రమాలు



మండపేట నియోజకవర్గాన్ని ఇసుక అక్రమాలకు కేరాఫ్‌గా టీడీపీ ప్రభుత్వం మార్చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అదే ఒరవడిని కొనసాగిస్తూ రాత్రింబవళ్ల అక్రమంగా ఇసుకను తరలించేస్తుంది. గోదావరి నదీ గర్భంలో కూటమి పాలకులు చేస్తున్న అక్రమాలకు గోదావరి గట్టున ఉన్న నిల్వలు కరిగిపోతున్న తీరే నిదర్శనం.

–గూటం సత్యనారాయణ,
కపిలేశ్వరపురం
మండలం

బూటకపు హామీలతో గద్దెనెక్కిన కూటమి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్
- పట్టణంలో పార్టీ సమావేశం


బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్, ఎంపీ బోస్ తదితరులు

రామచంద్రపురం: ఎన్నికల్లో బూటకపు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన తరువాత ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని వైఎస్ఆర్ సీపీ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలోని గాంధీపేటలోని పార్టీ కార్యాలయం వద్ద బాబూ ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని పార్టీ నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ హాజరయ్యారు. తొలుత కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజలకు తెలిపేందుకే బాబూ షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు వెళ్లి వివరించాలని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. అమలు సాధ్యం కానీ హామీలను ఇచ్చిన ప్రజలను మోసం చేస్తుందని, రాష్ట్రంలో అరచకపు పాలన సాగిస్తోందన్నారు. ప్రభుత్వం చేస్తున్న డైవర్షన్ పాలిటిక్స్‌ను ప్రతి ఇంటికి వెళ్లి తెలియజేసేందుకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి పిలుపునిచ్చారన్నారు. త్వరలోనే పట్టణంలోని అన్ని వార్డుల్లోను బాబూ ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ మోసాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ముఖ్యఅతిథిగా ఎంపీ బోస్ మాట్లాడుతూ దేశంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుచ తప్పకుండా అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభివృద్ధి కోసం ఎన్నో సేవలందించారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలను మరచిపోయి డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీస్తుందన్నారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కుడుపూటి శ్రీనివాసరావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళీ, మున్సిపల్ చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ కౌన్సిలర్‌లు, పార్టీ నేతలు పెంటపాటి శ్రీను, పోతంశెట్టి గోపాలకృష్ణ, మల్లిడి సాయిలక్ష్మి, బంగారుబాబు, పట్టణంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఎల్ఓలకు ముగిసిన శిక్షణ


మండపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న బీఎల్ఓలు

కపిలేశ్వరపురం (మండపేట): బీఎల్ఓల శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. జాతీయ శిక్షణా కార్యక్రమంలో భాగంగా మండపేట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి మండపేట పట్టణం, రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లో ఒక్కొక్క రోజు చొప్పున, రోజుకు 45 మంది చొప్పున ఐదు విడతలుగా శిక్షణ తరగతులను నిర్వహించారు. మూడు మండలాలు, మండపేట పట్టణంలో మిగిలిన 45 మంది బీఎల్ఓలకు మండపేట ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. మండపేట అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.కృష్ణమూర్తి పర్యవేక్షణలో సహాయ ఓటరు నమోదు అధికారి, తహసీల్దార్ పి.తేజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ తరగతులకు మూడు మండలాలు, మున్సిపాలిటీ పరిధిలోని బీఎల్ఓలు హాజరయ్యారు. ఇటీవల ఢిల్లీలో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్ నాగం నాగ శివ ఎన్నికల విధులు, బాధ్యతలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సూచనలు చేశారు. అనంతరం ఎన్నికల కమిషన్ రూపొందించిన గూగుల్ లింక్ ద్వారా శిక్షణ అంశాలపై పరీక్ష నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి ధ్రువపత్రాలను అందజేశారు. ఎన్నికల విధులను చిత్తశుద్ధితో అమలు చేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మెహర్ బాబా, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ ఎం. శ్రీనివాసరావు, ఎన్నికల డేటా ఎంట్రీ ఆపరేటర్ జి.ఆంజనేయులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉంగరాల రాంబాబు, మేడపాటి రవీంద్రరెడ్డి, పాలిక రమణ, పందిరి వీర్రాజు, గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

అక్రమాలకు తావిస్తే కఠిన చర్యలు

రామచంద్రపురం ఆర్డీఓ అఖిల


కపిలేశ్వరపురం ఇసుక నిల్వల వద్ద రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ అఖిల

కపిలేశ్వరపురం: కపిలేశ్వరపురం, తాతపూడి ర్యాంపుల పరిధిలోని ఇసుక నిల్వలు అక్రమంగా తరలిపోతే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని, కఠిన చర్యలు తప్పవని రామచంద్రపురం ఆర్డీఓ అఖిల మండల రెవెన్యూ అధికారులను హెచ్చరించినట్టు సమాచారం. ఆయా ర్యాంపుల్లోని ఇసుక నిల్వలను గురువారం ఆమె సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. మండలంలోని ర్యాంపులు అక్రమాలకు నిలయంగా మారడంతో జిల్లా ఉన్నతాధికారులు ఆయా ర్యాంపుల నిర్వహణపై నిఘా పెట్టారు. జూన్ 30న జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ర్యాంపులను తనిఖీ చేశారు. గోదావరి నదీ గర్భంలో తవ్వకాలను నిలిపివేయాలని నిబంధనలు రూపొందించినప్పటికీ జూన్ నెలలో తథేచ్ఛగా తవ్వకాలు జరపడంపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటి నుంచి మండలంలోని ర్యాంపుల నిర్వహణపై తరచూ ఉన్నతాధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఆర్డీఓ డి.అఖిల గురువారం ఇసుక నిల్వలను పరిశీలించి సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. ప్రతి ఇసుక లోడుకు సంబంధించిన బిల్‌ను విధిగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో వివాదాస్పదమైన శ్రీరాంపురం ర్యాంపును పరిశీలించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ర్యాంపును తెరవరాదని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి తెరిస్తే అధికారులు తగిన చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఆమె వెంట తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎస్సై హరీష్ కుమార్, గ్రామ కార్యదర్శి శివచక్రవర్తి, ఆర్ఐ అర్జమ్మ, వీఆర్వోలు ఉన్నారు.

వర్షం కురవక.. పనులు జరగక..

- పెరుగుతున్న ఎండలు
- అందని సాగునీరు
- ఆలస్యమైన నాట్లు
- ఎండిపోతున్న నారు మడులు


పామర్రులో సాగునీరు అందక ఎండిపోతున్న నాట్లు


కె.గంగవరంలో దమ్ము చేస్తున్న కౌలు రైతు

కె.గంగవరం: వరుణుడు ముఖం చాటేశాడు. జూలై వచ్చినా వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్‌సాగు ఆరంభంలోనే వర్షాభావం ఏర్పడడంతో సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఏటా పెరుగుతున్న సాగు ఖర్చులకు తోడు, ఈ ఏడాది సాగునీటికి అదనపు వ్యయం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటి వరకు వర్షాలు అంతంతమాత్రం పడి రైతులను మాత్రం నిరాశపరిచింది. అయితే వర్షాభావ పరిస్థితిలోనే రైతులు తొలకరి పనులు రైతులు ముమ్మరం చేశారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఇప్పటి వరకు 60 శాతం నాట్లు పూర్తి అయ్యేయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

ఎండల కారణంగా..

ఈ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు, ఎండ తాకిడితో వరినాట్లు ఆలస్యమయ్యాయి. ఈ నెల మొదట్లోని కాలువకు నీరు వచ్చినా వర్షం లేకపోవడంతో సాగు కొంత మేర ఆలస్యమైంది. దీంతో కేవలం రైతులు నారుమడులు వేయడంతోనే సరిపుచ్చుకున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో ఎక్కువ శాతం రైతులు వరినే పండిస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో కె.గంగవరం మండలంలో 4200 హెక్టార్లు, కాజులూరులో 4500 హెక్టార్లు, రామచంద్రపురం మండలంలో 5046 హెక్టార్లలో వరిసాగు చేస్తున్నారు.

సాగునీటి ఎద్దడి

రుతు పవనాలు ముందస్తుగా ప్రారంభం కావడంతో రైతులు తొలకరి సాగుకు శ్రీకారం చుట్టారు. రైతుల ఆశలపై నీళ్లు జల్లుతూ ఎండల తీవ్రత తిరిగి ప్రారంభం కావడంతో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడింది. నీటి ఎద్దడి నివారణ చేయాలంటూ రైతులు మొరపెట్టుకున్నా ప్రభుత్వం స్పందించక పోవడంతో రైతులు మోటార్లపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో రైతులు మోటార్ల కోసం రెండు వేల రూపాయలకు పైగా అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికే గతంలో కంటే ఖర్చు పెరిగాయని, ఈ తరుణంలో ఇంజిన్లు ఖర్చు పెనుభారంగా మారిందంటున్నారు. నారుమడికి రూ.4 వేలు, నాట్లు వేయడానికి రూ.6 వేలు ఎరువులు, సస్యరక్షణకు మరో రూ.20 వేలు ఖర్చు చేయాల్సి వస్తుందని వారు చెబుతున్నారు. ఇదిలా ఉండగా సాగు మధ్యలో ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు లేకపోతే, కనీస పెట్టుబడులతో గట్టెక్కుతున్న రైతులకు అకాల వర్షాలు, తుపాన్లు మరింత పెట్టుబడి పెంచి నష్టాల ఊబిలో నెట్టేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కె.గంగవరం మండల పరిధిలోని పామర్రు, యండగండి, భట్లపాలిక, పేకేరు, కాజులూరు, రామచంద్రపురం మండలంలోని మెట్ట ప్రాంతాలలో సాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది.

నీరున్న దగ్గర పనులు చేయాలి



ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని గ్రామాల్లో సాగునీరు అందుతున్న చోట్ల వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే సాగు ఆలస్యమయింది. పనులు ముందుకు సాగకపోతే నవంబర్‌లో వచ్చే తుపాన్లతో రైతులు నష్టపోయే పరిస్థితి ఉంది. రైతులందరూ నాట్లు వేగంగా పూర్తి చేయాలి. సాగునీరు పూర్తి స్థాయిలో అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

– ఏఓ సద్గురు మూర్తి కె.గంగవరం

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడితో ఎమ్మెల్సీ తోట భేటీ


మండపేటలో ఆదిత్య కుమార్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): వైఎస్సార్ సీపీ మండపేట నియోజకవర్గ పరిశీలకుడు కటకంశెట్టి విజయధర్మ ఆదిత్య కుమార్‌తో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గురువారం భేటీ అయ్యారు. మండపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ఆదిత్య కుమార్ సందర్శించారు. ఆయనతో పాటు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తెన్నేటి కిశోర్‌లకు ఎమ్మెల్సీ తోట ఘనంగా స్వాగతం పలికారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడం, కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించడం, ప్రజాక్షేత్రంలో పార్టీ విధి విధానాలను ప్రచారం చేయడం తదితర అంశాలపై చర్చించారు. భేటీలో జిల్లా పార్టీ అధికార ప్రతినిధి సిరిపురపు శ్రీనివాస్, సర్పంచ్ సలాది సతీష్, నాయకులు పాల్గొన్నారు.

అముజూరు సొసైటీ అధ్యక్షుడిగా గోవిందరాజు



కె.గంగవరం: మండల పరిధిలోని కూళ్ల, అముజూరు సొసైటి అధ్యక్షుడిగా కూళ్ల గ్రామ మాజీ సర్పంచ్ పెంకే గోవిందరాజు ఎంపికయ్యారు. ఈ మేరకు చీఫ్ సెక్రటరి బి.రాజశేఖర్ నుంచి ఉత్తర్వులు ఆయన అందుకున్నారు. సొసైటి సభ్యులుగా అముజూరు గ్రామానికి చెందిన నేమాని సత్యనారాయణమూర్తి, కూళ్ల శివారు నీలగిరిపేటకు చెందిన ఏడిద గంగాధరరావు కూడా ఎంపికయ్యారు. సొసైటీ అధ్యక్షుడిగా రైతుల సమస్యలు పరిష్కరించడంతో పాటు సొసైటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ద్రాక్షారామలో దహూం..


ద్రాక్షారామలో దహూం కార్యక్రమంలో ఊరేగింపు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో ఇమాం హుస్సేన్ వీర మరణం తరువాత పదో రోజు నిర్వహించే దహూం కార్యక్రమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆజా ఖానయే జహరా పంజా నుంచి మౌలా ముస్కిల్ కుషా పంజీషా వరకూ ముస్లిం భక్తులు మాతం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారుడు అహ్మద్ షరీఫ్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, వైఎస్సార్ సీపీ రైతు సంఘం నాయకుడు రెడ్డి రాధాకృష్ణ, పారిశ్రామికవేత్త వల్లూరి సాయికుమార్, గన్ని కృష్ణ సల్మాన్ తదితరులు పాల్గొన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అంజుమనే సంఘాలు, పంజాల ధర్మకర్తలు భోజన వసతి కల్పించారు.

ఉపాధ్యాయులకు సత్కారం


ఉపాధ్యాయులను సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలుకుతున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని కాపవరం జెడ్పీ హైస్కూల్‌లో పని చేసి వెంకటాయపాలెం ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వెళుతున్న దండూరి నాగలక్ష్మి, మసకపల్లి పాఠశాలకు బదిలీపై వెళుతున్న పోతంశెట్టి మధుమోహన్‌లను గ్రామ ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా గ్రామ ఎంపీటీసీ రెడ్నం సతీష్ మాట్లాడుతూ ప్రాథమికోన్నత పాఠశాలగా ఉన్న ఈ పాఠశాలను 6 సంవత్సరాల పాటు ప్రధానోపాధ్యాయినిగా ఉన్న నాగలక్ష్మి హైస్కూల్‌గా అభివృద్ధి చేయడంలోను, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేపట్టిన నాడు–నేడులో పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంలోను ఎనలేని శ్రద్ధ చూపించారన్నారు. ఎంటీఎస్‌గా పనిచేసిన మధుమోహన్ మాస్టారు తన ఇద్దరు పిల్లలను ఇదే పాఠశాలలో చదివిస్తూ పాఠశాలపై ప్రజల్లో మంచి నమ్మకాన్ని పెంచారని అన్నారు. వీరిద్దరి బదిలీ పాఠశాలకు, విద్యార్థులకు తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యనమదల మంగాదేవి, విద్యా కమిటీ చైర్మన్ గీసాల వీరవెంకట రామ్‌ప్రసాద్, మాజీ చైర్మన్ మత్తి లక్ష్మీ మణిమాల, ప్రధానోపాధ్యాయుడు ముమ్మిడి సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం వెలగతోడు పీఏసీఎస్ నూతన త్రిసభ్య కమిటీ సభ్యులు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. కమిటీ చైర్మన్‌గా వల్లూరి వీర వెంకట సత్యనారాయణ (అబ్బు), సభ్యులుగా సర్రాకుల అబ్బులు, బోనగిరి సూర్యారావులతో అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. గ్రామానికి చెందిన నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సొసైటీల త్రిసభ్య కమిటీల ప్రమాణ స్వీకారం

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఉండూరు, చోడవరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉండూరులో సొసైటీ చైర్మన్‌గా మేడిశెట్టి రాధాకృష్ణమూర్తి, పర్సన్లుగా చోడిశెట్టి వీరభద్రరావు, రాయుడు లోవప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. అదేవిధంగా చోడవరం చైర్‌పర్సన్‌గా నూనె లక్ష్మయ్య, పర్సన్లుగా రెడ్డి వీర రాఘవులు, చటకాల రామదాసు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం, సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, ఎంపీటీసీ యెన్నంద దేవి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, నాయకులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి సహకార సంఘాలు కృషి చేయాలి

కాజులూరు: రైతుల అభివృద్ధికి సహకార సంఘాలు కృషి చేయాలని రాష్ట్ర మాజీ సహకార శాఖ మంత్రి చిక్కాల రామచంద్రరావు అన్నారు. గొల్లపాలెం పీఏసీఎస్ నూతన చైర్మన్‌గా నియమితులైన మండల గౌడ సంఘం అధ్యక్షుడు అంగర శ్రీనివాస్‌గౌడ్ పీఏసీఎస్ పర్సన్లుగా నియమితులైన డేగల సుబ్బారావు, మాత నాగరాజు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమం స్థానిక పీఏసీఎస్ కార్యాలయ ఆవరణంలో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో విశ్రాంత జిల్లా బిసి సంక్షేమశాఖ అధికారి సనపాల ధనరాజు, జెడ్పీ మాజీ చైర్మెన్ గుత్తల బుల్లిరాజు, డేగల సతీష్, అంగర శ్రీనివాస్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అల్లవరం: అమలాపురం నుంచి అల్లవరం వస్తున్న అంబటి రాజేష్ (22) ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న ఇటుకల గుట్టని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై తిరుమలరావు తెలిపిన వివరాల మేరకు అమలాపురం నుంచి బుధవారం అర్ధరాత్రి మోటారుసైకిల్‌పై వస్తున్న రాజేష్ కోడూరుపాడు పంచాయతీ ఆకులవారివీధిలో ఈ ప్రమాదానికి గురయ్యాడు. అతడు అల్లవరంలోని తన మేనమామ ఇంటిలో ఉంటున్నాడు. రాజేష్ తండ్రి జీవనోపాధి నిమిత్తం హైదారాబాద్‌లో ఉంటుండగా, తల్లి గల్ఫ్‌లో ఉంటున్నారని ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, రాజేష్ మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబీలకు అప్పగించామని ఎస్సై తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కపిలేశ్వరపురం: మండపేట మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాలరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కేశవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లపై ఉన్న చెట్టు కొమ్మలు తొలగింపు పనుల కారణంగా అగ్రికల్చరల్ ఫీడర్ పరిధిలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. తాపేశ్వరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వెలగతోడు ఫీడర్‌లో ఆర్‌డీఎస్ఎస్ పనులు నిమిత్తం వెలగతోడు, మెర్నిపాడు, పాలతోడు, ఇప్పనపాడు గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ద్వారపూడి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఇండస్ట్రియల్ ఫీడర్‌కు చెందిన విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.